క్లుప్తంగా

నియామక పత్రం అందజేత



మరిపెడ రూరల్: మండలం కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న శ్రీలక్ష్మి ఇటీవల ఎంపీఓగా ఎంపికైంది. కాగా ఇట్టి నియామక పత్రాన్ని శనివారం హైదరాబాద్‌లో సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా అందుకుంది. ఎంపీఓగా ఎంపికైన శ్రీలక్ష్మిని తహసీల్దార్ కృష్ణవేణి, ఆర్ఐఎస్ శరత్‌చంద్రతోపాటు తహసీల్దార్ కార్యాలయంలోని తోటి సిబ్బంది, బంధు, మిత్రులు అభినందించారు.

ట్రస్మా జిల్లా అధ్యక్షుడిగా యాకాంతంగౌడ్



కేసముద్రం: తెలంగాణ రికగ్నైజ్ స్కూల్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్(ట్రస్మా) జిల్లా అధ్యక్షుడిగా మున్సిపాలిటీ పరిధి కేసముద్రంవిలేజ్‌లోని శ్రీవివేకవర్ధిని హైస్కూల్‌కి చెందిన కరస్పాండెంట్ చిర్ర యాకాంతంగౌడ్ ఎన్నికయ్యారు. ఆదివారం మండలంలోని మహముద్‌పట్నంలోని శ్రీ వివేకవర్ధిని హైస్కూల్‌లో ట్రస్మా జిల్లా సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈమేరకు ట్రస్మా రాష్ట్ర ఎన్నికల అబ్జర్వర్ ప్రభాకర్ రెడ్డి సమక్షంలో ట్రస్మా జిల్లా నూతన కమిటీని ఎన్నుకున్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శిగా వక్కంతుల అప్పారావు(దోర్నకల్), కోశాధికారిగా కేతిరెడ్డి నరేష్‌రెడ్డి(తొర్రూరు)లను ఎన్నుకున్నారు.

అవార్డు అందజేత



మహబూబాబాద్ అర్బన్: మహబూబాబాద్ జిల్లా కేంద్రానికి చెందిన సీఆర్ఐ పంప్స్, నంది పీవీసీ పైపులు, గోదావరి పైప్స్, గోల్డ్ మెడల్ డీలర్ నాళ్ల వీరన్నకు ఓ తెలుగు టీవీ నిర్వాహకులు అచీవ్ అవార్డును ప్రకటించారు. హైదరాబాద్‌లో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు చేతుల మీదుగా వీరన్న అవార్డు అందుకున్నాడు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం



తొర్రూరు రూరల్: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి కోమాలో ఉండి చికిత్స పొందుతున్న తుమ్మనపల్లి ప్రణీత్ కుటుంబానికి రూ.50వేల నగదును కాంగ్రెస్ నాయకురాలు మాలోతు సునీత, రాజేందర్ దంపతులు ఆదివారం అందించారు. ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి, టీపీసీసీ ఉపాధ్యక్షురాలు ఝాన్సీరెడ్డి సహాయ, సహకారాలతో ఆదుకుంటూ ముందుకు వెళ్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో నాయకులు దేశగాని బిక్షపతి, బోగ కమలాకర్, బందు వెంకన్న, సోమారపు ఐలయ్య, కనుకుంట్ల కుమార్, వడ్లకొండ కుమార్, కొమ్ము యాకయ్య, రవీందర్ పాల్గొన్నారు.

విజేతలకు బహుమతుల ప్రదానం

గార్ల: గార్లలో రెండు రోజులుగా నిర్వహించిన 3మండలాల జోనల్‌స్థాయి క్రీడాపోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను ఆదివారం ఎంఈఓ వీరభద్రం చేతుల మీదుగా అందజేశారు. బహుమతులు షీల్డ్, మెమొంటోలను పీఏసీఎస్ వైస్ చైర్మన్ గంగావత్ లక్ష్మణ్‌నాయక్ రూ.15,000 వ్యయంతో కొనుగోలు చేసి గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఎస్సై ఎస్‌కె రియాజ్‌పాషా, హెచ్ఎంలు శీలంశెట్టి వెంకటేశ్వర్లు, మాలోత్ శివ, పీడీ గూగులోత్ శ్రీను, యాకూబ్‌పాషా, పీఈటీ పాల్గొన్నారు.

సన్మానం

మహబూబాబాద్ అర్బన్: విజయవాడలో నిర్వహించిన మాస్టర్ ఆక్వాటిక్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఆల్ ఇండియా స్విమ్మింగ్ పోటీల్లో జిల్లా కేంద్రంకు చెందిన బొప్పిడి శ్రీనివాస్‌రెడ్డి పాల్గొని 50మీటర్ల బ్యాక్‌స్ట్రోక్‌లో గోల్డ్‌మెడల్ సాధించగా కాళోజీ వాకర్స్ అసోసియేషన్ సభ్యులు ఆదివారం ఎన్టీఆర్ స్టేడియంలో ఘనంగా సన్మానించారు. ఆదేవిధంగా 200మీటర్ల ఫ్రీ స్టయిల్ విభాగంలో సిల్వర్ మెడల్ సాధించారు. కార్యక్రమంలో కాళోజీ వాకర్స్ అసోసియేషన్ ముఖ్య సలహాదారులు మైన శ్రీనివాసులు, జిల్లా అధ్యక్ష, కార్యదర్శి వెంకట్‌రెడ్డి, పట్టాభి లక్ష్మయ్య, కోశాధికారి విష్ణువర్ధన్, సభ్యులు సుధాకర్, వెంకన్న, వెంకటేశ్వర్లు, రాజన్న, మధుసూదన్‌రెడ్డి, శ్రీహరి, శ్యాంరావు, శ్రీనివాస్‌రెడ్డి, విద్యాసాగర్, తదితరులు పాల్గొన్నారు.

లక్ష్యం.. నిర్లక్ష్యం..

- నిరుపయోగంగా క్రీడా మైదానాలు
- పట్టించుకోని అధికారులు

చిన్నగూడూరు: గ్రామీణ ప్రాంతాల్లోని విద్యార్థులు, యువతలో దాగి ఉన్న క్రీడా నైపుణ్యాలను వెలికితీసి జిల్లా, రాష్ట్ర, జాతీయస్థాయికి తీసుకెళ్లాలనే లక్ష్యంతో గత ప్రభుత్వ హయాంలో గ్రామానికో క్రీడామైదానాన్ని ఏర్పాటు చేసింది. ఒక్కో క్రీడా ప్రాంగణానికి సుమారు రూ.5లక్షలు మంజూరు చేసి ఏర్పాటు చేశారు. మండలంలో 11 గ్రామపంచాయతీల్లో 10క్రీడా ప్రాంగణాలు ఉన్నాయి. అందులో కొన్ని మైదానాలు గ్రామాల్లో ఏర్పాటు చేయగా, మరికొన్ని గ్రామానికి దూరంగా గుట్టల ప్రాంతాల్లో ఏర్పాటు చేయడంతో నిర్వహణ లేక నిరుపయోగంగా మారాయి. దీంతో యువత, విద్యార్థులు ఆటలు ఆడేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. క్రీడా నైపుణ్యాలను మెరుగుపర్చుకునేందుకు ఏర్పాటు చేసిన మైదానాలు నేడు నిరుపయోగంగా మారాయని క్రీడాకారులు ఆరోపిస్తున్నారు.



మండల కేంద్రంలోని క్రీడా ప్రాంగణం



మన్నెగూడెంలో బోర్డుకే పరిమితమైన క్రీడామైదానం

వినియోగంలోకి తీసుకురావాలి



గ్రామాల్లో ఏర్పాటు చేసిన క్రీడా మైదానాల్లో వసతులు కరువయ్యాయి. గ్రామానికి దూరంగా ఏర్పాటు చేయడంతో పాటు మైదానాల్లో పిచ్చి మొక్కలు వెలిసి అక్కడికి వెళ్లి ఆడలేని పరిస్థితి ఉంది. క్రీడా మైదానాల్లో క్రీడా సామగ్రి, వసతులు కల్పించి వాడుకలోకి తీసుకురావాలి.

– జంపాల సోమన్న, చిన్నగూడూరు

మూడు కిలోమీటర్ల దూరం..

మండల కేంద్రంలో ప్రభుత్వ పాఠశాల ఉంటే క్రీడా ప్రాంగణం మూడు కిలో మీటర్ల దూరంలో ఏర్పాటు చేశారు. ఈ క్రీడా ప్రాంగణం చూస్తే ఆటలు ఆడటం కాదు.. అక్కడ ఒక్క క్షణం కూడా విద్యార్థులు నిలబడరు. గ్రామానికి దూరంగా క్రీడా ప్రాంగణం ఉండడంతో విద్యార్థులు, యువకులు అక్కడికి వెళ్లి ఆటలు ఆడేందుకు విముఖత చూపుతున్నారు. క్రీడా ప్రాంగణంలో నిర్వహణ లేకపోవడంతో పిచ్చి మొక్కలు పెరిగి చెత్తా చెదారంతో అధ్వానంగా మారి ఆటస్థలం నిరుపయోగంగా మారింది.

తారుమారైంది..

- ఓవర్‌లోడ్ వాహనాలతో ధ్వంసమైన రోడ్లు

కేసముద్రం: ఓవర్‌లోడ్ వాహనాలతో తారురోడ్డు పూర్తిగా ధ్వంసమై, గుంతలమయంగా మారిన సంఘటన కేసముద్రంవిలేజ్, ఇంటికన్నె గ్రామాల్లో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మున్సిపాలిటీ పరిధి కేసముద్రంవిలేజ్ నుంచి ఇనుగుర్తి మండలం కోమటిపల్లి గ్రామం వైపునకు, లక్షల రూపాలయల వెచ్చించి తారురోడ్డు వేశారు. ఈక్రమంలో గ్రీన్‌ఫీల్డ్ హైవే నిర్మాణం కోసం నిత్యం టిప్పర్లు తిరగడంతో తారు రోడ్డు ధ్వంసమైంది. దీనికి తోడుగా మిల్లుల వద్దకు ఓవర్‌లోడ్ లారీలు తిరుగుతుండటంతో రోడ్డు గుంతలమయంగా మారింది. నిత్యం కోమటిపల్లి, మాన్‌సింగ్ తండా, భుక్యారాంతండా, పాతతండా ప్రజలు ఇదే రహదారి నుంచి రాకపోకలు సాగిస్తుంటారు. ప్రస్తుతం గుంతలమయంగా మారిన రోడ్డు తోపాటు, వర్షాలు పడటంతో రోడ్డు అధ్వానంగా మారింది. ఇదే మార్గంలో కేసముద్రంవిలేజ్ శ్మశాన వాటిక ఉండటంతో దహన సంస్కారాలు నిర్వహించాలంటే బురదమయంగా మారిన రోడ్డు మీదుగా వెళ్లలేక స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అదే విధంగా ఇంటికన్నె గ్రామంలో ప్రధాన రహదారి నుంచి ఎస్సీ కాలనీకి వెళ్లే మార్గంలో నూతనంగా తారు రోడ్డు వేశారు. ఈక్రమంలో కొద్దిరోజుల నుంచి నిత్యం ఓవర్‌లోడ్ వాహనాలు తిరుగుతుండటంతో, తారు రోడ్డు పూర్తిగా ధ్వంసమైంది. దీనికి తోడుగా వర్షం కురిసిన ప్రతిసారి రాకపోకలకు ఇబ్బందులు తలెత్తుతున్నాయని స్థానిక ప్రజలు వాపోతున్నారు. లక్షల రూపాయల నిధులు వెచ్చించి నిర్మించిన తారు రోడ్లు ఓవర్‌లోడ్ వాహనాల కారణంగా ధ్వంసమవుతున్నా, ఏ ఒక్కరు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



ఇంటికన్నె గ్రామంలో ధ్వంసమైన తారు రోడ్డు



కేసముద్రం విలేజ్ నుంచి కోమటిపల్లి వైపునకు వెళ్లే తారురోడ్డు..

ఎస్టీ జాబితా నుంచి తొలగించాలి

నెహ్రూసెంటర్: లంబాడీలను ఎస్టీ జాబితానుంచి తొలగించాలని డిమాండ్‌చేస్తూ నవంబర్ 9వ తేదీన చలో మానుకోట ర్యాలీ, బహిరంగ సభను జయప్రదం చేయాలని ఆదివాసీ సంక్షేమ పరిషత్ జాతీయ అధ్యక్షుడు దాట్ల నాగేశ్వర్‌రావు, తుడుందెబ్బ రాష్ట్ర అధ్యక్షుడు ఈసం సుధాకర్ అన్నారు. జిల్లా కేంద్రంలో కొమురం భీం సెంటర్‌లో సభ పోస్టర్లను ఆదివారం ఆవిష్కరించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 342 నిబంధనలను పాటించకుండా ఓటు బ్యాంకు రాజకీయాల కోసం అక్రమంగా ఎస్టీ హోదాను పొందారని, వలసవాద లంబాడీలను ఎస్టీ జాబితా నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గొగ్గల రామస్వామి, జార కృష్ణ, నాగేశ్వర్‌రావుదొర, కుంజ నర్సింహారావు, జనార్దన్, బొల్లి సారయ్య, కల్తీ నరేష్, రామస్వామి, సునీల్ పాల్గొన్నారు.



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న సంఘం నాయకులు

గ్రామ సమస్యలు పరిష్కరించాలి

మరిపెడ రూరల్: మండలంలోని అబ్బాయిపాలెం గ్రామ పంచాయతీ పరిధిలో తిష్ట వేసిన సమస్యలను తక్షణమే పరిష్కరించాలని సీపీఎం సీనియర్ నాయకులు జినక ఎర్ర వెంకన్న డిమాండ్ చేశాడు. ఈ మేరకు ఆదివారం ఆయన మాట్లాడుతూ.. ఇటీవల కాలంలో గ్రామంలో వీధిదీపాలు ఏర్పాటు చేసినప్పటికీ మూన్నాళ్ల ముచ్చట అయిందన్నారు. పురవీధుల్లో చెత్త చెదారంతోపాటు మురుగునీరు నిల్వలు పేరుకపోయి దుర్వాసన వెదజల్లుతుందన్నారు. ఇప్పటికైన అధికారులు తక్షణమే స్పందించి గ్రామంలో తిష్ట వేసిన సమస్యలను పరిష్కరించాలని ఆయన డిమాండ్ చేశారు.

నూతన కమిటీ ఎన్నిక

తొర్రూరు: డివిజన్ కేంద్రంలోని సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో పాస్టర్స్ నూతన మండల కమిటీని ఏకగ్రీవంగా ఆదివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ప్రవీణ్‌కుమార్, ప్రధాన కార్యదర్శిగా కేవి పీటర్, కోశాధికారిగా ధర్మరాపు మహేందర్, ఉపాధ్యక్షుడిగా ఈనెపల్లి యాకుబ్, సంయుక్త కార్యదర్శిగా సంతోష్‌నాయక్, కార్యవర్గ సభ్యులుగా వెల్తూరి తిమోతి, భూక్య వెంకన్ననాయక్, గౌరవ అధ్యక్షుడిగా గుండాల నర్సయ్య, ముఖ్య సలహాదారులుగా ధర్మరాపు డేవిడ్‌రాజు, సుకుమార్‌లు ఎన్నికైయ్యారు.

ఘనంగా కేజీకేఎస్ వార్షికోత్సవం



నెహ్రూసెంటర్: జెండా ఎగురవేస్తున్న సంఘం నాయకులు



గార్లలో..



దంతాలపల్లి: జెండా ఎగురవేస్తున్న సంఘం నాయకులు

నెహ్రూసెంటర్: కల్లుగీత కార్మిక సంఘం (కేజీకేఎస్) 68వ వార్షికోత్సవం సందర్భంగా జిల్లా కేంద్రంలోని సంఘ కార్యాలయంలో సంఘం జెండాను ఆదివారం ఆవిష్కరించారు. అనంతరం జరిగిన కేజీకేఎస్ జిల్లా కమిటీ సమావేశంలో కేజీకేఎస్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు యమగాని వెంకన్న, గౌని వెంకన్న మాట్లాడారు. కల్లుగీత కార్మికుల ఉపాధి, సంరక్షణ కోసం ప్రభుత్వాలు చర్యలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో గునిగంటి మోహన్, బబ్బూరి ఉప్పలయ్య, మోడం వెంకటేశ్వర్లు, పానుగంటి వీరస్వామి, మొగుళ్ళ యాకయ్య, శీలం సత్యనారాయణ, డొనికెని రామన్న, రాజశేఖర్, వెంకన్న పాల్గొన్నారు.

నెల్లికుదురు: కల్లు గీతా కార్మిక సంఘం ఆవిర్భావ వేడుకలను సంఘం మండల అధ్యక్షుడు వీరగోని మల్లేశం గౌడ్ అధ్యక్షతన స్థానిక సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహం వద్ద ఆదివారం జెండా ఎగుర వేసి ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో సుధాకర్, యాలాద్రి, వెంకన్న, గుట్టయ్య, సత్యనారాయణ, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

గార్ల: గార్లలో గీత పనివారల సంఘం 68వ వార్షికోత్సవం వేడుకలను ఆదివారం గౌడసంఘం నాయకులు ఘనంగా నిర్వహించారు. తొలుత గీత పనివార సంఘం జెండాను గౌడసంఘం సీనియర్ రాష్ట్ర నాయకుడు తోడేటి కొమరయ్య ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు దొంతు రామూర్తిగౌడ్, కోశాధికారి నక్క నాగార్జునగౌడ్, వెంకన్నగౌడ్, రాసమల్ల పెద్దవెంకన్న, శ్రీనుగౌడ్, గాజుల కృష్ణగౌడ్, తాళ్లపల్లి కృష్ణగౌడ్, ఎల్లయ్యగౌడ్, వీరన్నగౌడ్ పాల్గొన్నారు.

దంతాలపల్లి: గీత కార్మికులు ఐక్యతతో పోరాడి తమ హక్కులను సాధించుకోవాలని గీత కార్మిక సంఘం మండల అధ్యక్షుడు కారుపోతుల అనిల్ అన్నారు. గీత కార్మిక సంఘం వార్షికోత్సవం సందర్భంగా మండలంలోని ఆగపేట, నిదానపురం గ్రామాలలో సంఘం జండా ఆవిష్కరించారు. కార్యక్రమంలో గుండగాని లింగయ్య, కొత్త అంతయ్య, కొత్త కొమురవల్లి, గుండ్ల యాకయ్య, పూజరి లాలు, జనార్దన్ పాల్గొన్నారు.

మరిపెడ చేరుకున్న జన చైతన్య బైక్ యాత్ర

మరిపెడ: యువత సమాజానికి మంచి పేరు తీసుకరావాలని టీచర్ రాచకొండ ప్రభాకర్ అన్నారు. గంజాయి, డ్రగ్స్ రహిత సమాజం కోసం రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టిన జన చైతన్య బైక్ యాత్రలో భాగంగా ఆదివారం మరిపెడకు చేరుకుంది. జనచైతన్య యాత్రలో భాగంగా దసరా సెలవులనుంచి ఈ రోజు వరకు రాష్ట్రంలోని వివిధ జిల్లాలో సుమారు 2500కిలోమీటర్లు పర్యటించినట్లు ఆయన చెప్పారు.

సీహెచ్‌సీకి దిండ్లు వితరణ



గార్ల: సీహెచ్‌సీకి గార్లకు చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు గుగులోత్ భద్రునాయక్ సొంత ఖర్చుతో 12 మెత్తటి దిండ్లు కొనుగోలు చేసి రోగుల సౌకర్యార్థం ఆస్పత్రికి వితరణ చేశారు. కార్యక్రమంలో డాక్టర్ హనుమంతరావు, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ తాళ్లపల్లి కృష్ణగౌడ్, కోల కుమార్‌గౌడ్, యాకూబ్‌పాషా, రాంకుమార్ పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

మహబూబాబాద్ రూరల్: చికిత్స పొందుతూ వ్యక్తి మృతిచెందిన సంఘటన మహబూబాబాద్ మండలంలోని కంబాలపల్లి గ్రామంలో చోటుచేసుకుందని రూరల్ ఎస్సై వి.దీపిక ఆదివారం తెలిపారు. మహబూబాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని మున్నేరువాగు సమీపంలో ఈనెల 17వ తేదీ రాత్రి మూడు ద్విచక్రవాహనాల ప్రమాదాలు జరిగాయన్నారు. జిల్లాలోని బయ్యారం మండలం ఉప్పలపాడు గ్రామానికి చెందిన గుగులోతు హనుమంతు ద్విచక్ర వాహనంపై ఇంటికి వెళ్తున్నాడు. భద్రాచలం జిల్లా లక్ష్మీదేవిపల్లికి చెందిన కల్యాణం సురేష్ తన ద్విచక్రవాహనంపై వెనుక నుంచి వచ్చి హనుమంతు ఢీకొట్టాడని పేర్కొన్నారు. అదే సమయంలో ఆ రెండు ద్విచక్ర వాహనాల వెనకాల వస్తున్న మానుకోట మండలంలోని కంబాలపల్లి గ్రామానికి చెందిన చదల జయరాజు (48) ద్విచక్ర వాహనం ఒక్కసారిగా సురేష్ వాహనాన్ని ఢీకొందన్నారు. ఈ ప్రమాదంలో జయరాజు ద్విచక్రవాహనంపై నుంచి కింద పడిపోగా తీవ్రగాయాలు కాగా వెంటనే చికిత్స నిమిత్తం మహబూబాబాద్ ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి తరలించి ఆరోగ్య పరిస్థితి విషమించడంతో మెరుగైన వైద్యం కోసం వరంగల్ ఎంజీఎంకు తరలించగా అక్కడే చికిత్స పొందుతూ మృతిచెందాడని తెలిపారు. మృతుడి కుమారుడు పవన్ కుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి పోస్టుమార్టం అనంతరం జయరాజు మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించామని పేర్కొన్నారు. ప్రమాద ఘటనకు బాధ్యుడిగా భావించి కళ్యాణం సురేష్ పై కేసు నమోదు చేశామని తెలిపారు.

కేసముద్రంలో..

కేసముద్రం: గడ్డిమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఓ వ్యక్తి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటన మండలంలోని పెనుగొండ గ్రామంలో చోటుచేసుకుంది. ఎస్సై క్రాంతికిరణ్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన లాక లక్ష్మయ్య(50) అనే వ్యక్తి కొంతకాలంగా మద్యానికి బానిసై పనికి వెళ్లకుండా ఇంటి వద్దే ఉంటున్నాడు. ఈ క్రమంలో తన ఆరోగ్యం బాగాలేకపోవడంతో ఆసుపత్రుల చుట్టూ తిరుగుతూ, మరో వైపు మద్యం తాగడం మానకపోవడంతో కుటుంబసభ్యులు, గ్రామస్తులు తనకు విలువ ఇవ్వడం లేదనే కారణంతో జీవితంపై విరక్తి చెంది ఈనెల 17న వ్యవసాయ బావి వద్ద గడ్డి మందు తాగి కిందపడిపోయాడు. అతన్ని మానుకోట జనరల్ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం వరంగల్ ఎంజీఎంకు తరలించగా చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. మృతుడి భార్య ఇచ్చిన పిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

తొర్రూరు రూరల్‌లో ఇద్దరు..

తొర్రూరు రూరల్: రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలైనా ముగ్గురిలో చికిత్స పొందుతూ ఇద్దరు వ్యక్తులు మృతి చెందిన సంఘటన ఆదివారం ఉదయం చోటు చేసుకుంది. ఎస్సై ఉపేందర్ కథనం ప్రకారం శనివారం అర్ధరాత్రి కోళ్ల లోడ్‌తో మరిపెడ నుంచి తొర్రూరుకు వస్తున్న డీసీఎం వాహనం డ్రైవర్ నిద్ర మత్తులో వరంగల్ నుంచి ఖమ్మం వైపు ఎదురుగా వెళ్తున్న లారీని మండలంలోని మాటేడు గ్రామ శివారులో ఖమ్మం-వరంగల్ జాతీయ రహదరిపై ఢీకొట్టారు. దీంతో డీసీఎం వాహనం బొల్తాపడడంతో అందులో ఉన్న డ్రైవర్ రామానుజం, కోళ్ల కంపెనీ సూపర్‌వైజర్ దయాకర్, లేబర్ రాజయ్య రోడ్డుపై పడిపోవడంతో తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే స్థానిక సమాచారం మేరకు తీవ్ర గాయాలతో ఉన్న రామానుజం, దయాకర్, రాజయ్యలను 108 వాహనంతో వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించి వైద్యం అందిస్తుండగా, చికిత్స పొందుతూ డ్రైవర్ రామానుజం, సూపర్‌వైజర్ దయాకర్ మృతి చెందినట్లు ఎస్సై తెలిపారు.

యువకుడిపై కేసు నమోదు

మహబూబాబాద్ రూరల్: సోషల్ మీడియా వేదికగా ఓ ప్రధాన రాజకీయ పార్టీకి చెందిన నేతలను అసభ్యకర పదజాలంతో దూషిస్తూ పోస్టు పెట్టిన యువకుడిపై కేసు నమోదు చేశామని మహబూబాబాద్ టౌన్ సీఐ గట్ల మహేందర్ రెడ్డి ఆదివారం తెలిపారు. బీసీలకు రిజర్వేషన్లు కల్పించే అంశంలో బీజేపీ పార్టీ, ముఖ్య నేతలను దూషిస్తూ పట్టణానికి చెందిన బానోతు వినోద్ అలియాస్ సిద్ధు అనే యువకుడు సోషల్ మీడియా వేదికగా అసభ్యకర పదజాలంతో పోస్టు పెట్టాడన్నారు. దీంతో బీజేపీ పట్టణ అధ్యక్షుడు వెన్నమల్ల అజయ్ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశామని సీఐ తెలిపారు.

ఆర్థికసాయం

బయ్యారం: ఇటీవల మండలంలోని జగ్గుతండాలో విషజ్వరంతో మరణించిన పేపర్‌బాయ్ గోగుల అజయ్ కుటుంబానికి జిల్లా పేపర్ డిస్ట్రిబ్యూటర్ అసోసియేషన్, ఏజెంట్ల తరపున ఆదివారం ఆర్థిక సహాయం అందజేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు బి.గోపాల్, పత్రికల ఏజెంట్లు శ్రీనివాస్, సారంగపాణి, అశోక్ పాల్గొన్నారు.

వైకుంఠధామంలో సౌకర్యాలు కరువు

- విద్యుత్ లేక ఇక్కట్లు
- గాలికి ఎగిరిపోయిన రేకులు
- తాగునీటి బోరు మోటారు చోరీ
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు

గార్ల: గార్ల సమీపంలోని పాకాల ఏటి వద్ద నిర్మించిన వైకుంఠధామం వద్ద కనీస సౌకర్యాలు కల్పించకపోవడంతో మృతదేహాలకు తీసుకెళ్లిన సమయంతో ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు. గార్ల పాకాల ఏటి వద్ద 8ఏళ్ల క్రితం సుమారు రూ.15లక్షల వ్యయంతో నిర్మించిన వైకుంఠధామానికి ఆలన పాలన కరువవడం, గత ఏడాది గాలిదుమారాకి వైకుంఠధామం పైకప్పు రేకులు లేచిపోవడంతో మృతదేహాల దహన సంస్కారాలకు వెళ్లే ప్రజలకు నిలువనీడలేకుండా పోయింది. రాత్రి సమయంలో మృతదేహాలకు దహన సంస్కారాలు చేసేందుకు వెళ్తే కనీసం విద్యుత్ సౌకర్యం లేక ప్రజలు సెల్‌ఫోన్ల లైట్లు ఆన్ చేసి కార్యక్రమం ముగిస్తున్నారు. వైకుంఠధామం పైకప్పు రేకులు లేచిపోయాయని సంబంధిత అధికారులకు విన్నవించినా ఫలితం లేదు. దీనికి తోడు కిటికీలు, తలుపులను సైతం గుర్తుతెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారు. తాగునీటి కోసం గతంలో పంచాయతీ అధికారులు బోరుకు అమర్చిన మోటార్ సైతం చోరీకి గురైంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి వైకుంఠధామం భవనం పైకప్పుకు రేకులు వేయించి, తాగునీరు, వీధిలైట్లు ఏర్పాటు చేయాలని గార్ల పట్టణ ప్రజలు డిమాండ్ చేశారు.



ఎగిరిపోయిన వైకుంఠధామం రేకులు



డోర్లు ఎత్తుకెళ్లిన దొంగలు



అధ్వానంగా స్నానాల గదులు

కనీస సౌకర్యాలు కల్పించాలి



గార్ల పాకాల ఏటి వద్ద గల వైకుంఠధామం వద్ద ప్రజలకు తాగునీరు, వీధిలైట్లు, గాలిదుమారానికి లేచిపోయిన పైకప్పు రేకులను సంబంధిత అధికారులు ఏర్పాటు చేయాలి. వేసవికాలంలో పాకాల ఏరు ఎండిపోవడంతో మృతదేహాల దహన సంస్కారాలకు వెళ్తే తాగునీరు లేక, నిలువ నీడలేక ప్రజలు అల్లాడుతున్నారు.

– కందునూరి శ్రీనివాసరావు, గార్ల

వివాహిత ఆత్మహత్యాయత్నం

మహబూబాబాద్ రూరల్: తమ తప్పులేకున్నప్పటికీ అకారణంగా పోలీసులకు ఫిర్యాదు చేశారని ఆరోపిస్తూ, మనస్తాపానికి గురై ఓ వివాహిత పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన మహబూబాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని బేతోలు గ్రామంలో ఆదివారం చోటుచేసుకుంది. బాధితురాలు షేక్ యాకూబ్ బీ తెలిపిన వివరాల ప్రకారం.. మహబూబాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని బేతోలు గ్రామానికి చెందిన షేక్.యాకూబ్ బీ, అదే గ్రామానికి చెందిన వారి బంధువుల కుటుంబానికి మధ్య వ్యక్తిగతంగా ఘర్షణలు జరుగుతున్నాయి. రెండు కుటుంబాల మధ్య మనస్పర్థలు వచ్చి బంధువుల కుటుంబీకులు కురవి పోలీస్‌స్టేషన్‌లో తల్లి యాకుబ్ బీ, కుమారుడు ఇమ్రాన్ పాషాపై ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో కురవి పోలీసులు విచారణ నిమిత్తం బేతోలు గ్రామానికి చేరుకుని ఇమ్రాన్ పాషా ఇంటి వద్ద లేకపోవడంతో వచ్చాక పోలీస్ స్టేషనుకు రావాలని తల్లి యాకూబ్ బీతో చెప్పారు. దీంతో తమపై కేసు నమోదవుతుందని ఆందోళనకు గురైన ఆమె ఒంటిపై పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. గమనించిన స్థానికులు వెంటనే ఆమెను చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు.

ఒకే ఈతలో రెండు దూడల జననం

మరిపెడ రూరల్: ఓ ఆవు ఒకే ఈతలో రెండు దూడలు జన్మనిచ్చిన సంఘటన మరిపెడ మండలం వీరారం గ్రామ పంచాయతీ బొత్తలతండాలో ఆదివారం చోటుచేసుకుంది. కథనం ప్రకారం.. బొత్తలతండాకు చెందిన రైతు ధరంసోత్ జయేందర్ కొంతకాలంగా హనీ డైరీఫాం నడిపిస్తున్నాడు. ఈక్రమంలో ఫాంలోని ఓ ఆవుకు రెండు దూడలు జన్మించాయి. ఈ ఆవును ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుంచి గత రెండేళ్ల క్రితం కొనుగోలు చేసినట్లు రైతు తెలిపాడు. రెండు దూడలు కూడా పూర్తి ఆరోగ్యంగా ఉన్నాయి. రెండు కూడా కోడే దూడలు కావడం విశేషం. ఒకే ఆవుకు రెండు దూడలు జన్మించడం నూటిలో ఒకటి జన్యుపరంగా జరుగుతుందని మండల పశువైద్యుడు తెలిపారు.

ఆలయంలో మహాచండీ హోమం

తొర్రూరు: డివిజన్ కేంద్రంలోని భద్రకాళి ఆలయంలో మహాచండీ హోమాన్ని అత్యంత వైభవంగా ఆదివారం నిర్వహించారు. ప్రధానంగా ఆలయ అర్చకులు సంతోష్ శర్మ, గోపి శర్మల ఆధ్వర్యంలో వేద మంత్రాల సాక్షిగా హోమాన్ని, ప్రత్యేక పూజ కార్యక్రమాలను నిర్వహించగా, వందలాది మంది భక్తులు పాల్గొని తమ మొక్కులను చెల్లించుకున్నారు. కార్యక్రమంలో గురుస్వాములు మేరుగు మల్లేశంగౌడ్, రేవూరి వెంకన్న, అన్వర్, వంశీ, శ్రీకర్ పాల్గొన్నారు.